క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డితో భేటీ



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన గుడిపాల నాయకులు

గుడిపాల: అక్రమ మద్యం కేసులో అరెస్ట్ అయి బయటకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డిని గుడిపాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం తిరుపతిలో ఆయన నివాసంలో కలిశారు. చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజినీకాంత్, మధుసూదన్ రాయల్ ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎంపీ వారితో మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేత



గ్యాస్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

యాదమరి: జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశాల మేరకు 10 మంది గిరిజనులకు తహసీల్దార్ పార్థసారథి ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కీనాటంపల్లి పంచాయతీ షికారికాలనీలో మౌలిక వసతులపై అక్కడి ప్రజలతో మాట్లాడారు. గిరిజనుల సమగ్రాభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇక్కడి సమస్యల పరిష్కారంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయన గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలను చూపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ వేణు, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



హోంగార్డు కుటుంబానికి ఎఫ్‌డీ పత్రాలు ఇస్తున్న ఎస్పీ దూడీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు దామోదర్ నాయుడు కుటుంబానికి ఎస్పీ తుషార్ దూడీ అండగా నిలిచారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్ నుంచి రూ.3.50 లక్షలను పిల్లలు ఇద్దరి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ పత్రాలను వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో మృతుడి భార్య ఆర్తికి సీ కేటగిరీ కింద ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఎంటీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 4 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలపై 4 వినతులు అందాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ట్రాన్స్ కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు కరెంట్ స్తంభం మార్పు, అగ్రికల్చర్ కేటగిరీ మార్పు, మీటర్ పేరు మార్పు, బిల్లు సవరించాలంటూ వినతులు అందజేశారని తెలిపారు. నమోదైన 4 అర్జీల్లో మూడింటికి పరిష్కారం చూపామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఈఈలు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క కరిచి బాలికకు గాయాలు

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన పంచాయతీ చిన్నకంపల్లెలో బుధవారం పిచ్చికుక్క కరవడంతో బాలిక తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. చిన్నకంపల్లెకు చెందిన చంద్ర కుమార్తె మానస(10) ఇంటి వద్ద ఆడుకుంటూ వుంది. అటువైపు వెళ్తున్న పిచ్చికుక్క ఉన్నట్టు బాలికపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి తనిఖీ చేశారు. పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 41,798 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు.

మహిషాసుర మర్దిని.. రమ్యకపర్దిని శైలసుతే..

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు
- నేడు దసరా సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



విజయలక్ష్మిగా అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేటలో ఉన్న శ్రీదుర్గాంబ దేవస్థానంలో బుధవారం నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేసి పలురకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనార్థం భారీగా క్యూకట్టారు. అలంకార మండపంలో కుంకుమార్చనకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి అమ్మవారు పుష్పరథంలో విజలక్ష్మీదేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని నవధాన్యాలతో అలంకరించారు. రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారు బలరామ అవతారం, కట్టమంచిలోని సాయిబాబా ఆలయంలో మహిషారసురమర్దిని అలంకరణలో అమ్మవారు అభయమిచ్చారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పిళ్లారికుప్పం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శాకంబరీ దేవిగా పాలేటమ్మ

ఐరాల: స్థానిక పాలేటమ్మ అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్ గేటులో చాముండేశ్వరి దేవి ఆలయంలో అర్చకులు ఉదయం అమ్మవారికి కల్యాణోత్సవం, ధ్వజావరోహణం, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూలవిగ్రహానికి మహామంగళ హారతి, ప్రత్యేక పూజలు, ఉత్సవ విగ్రహమూర్తిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక వాహనంలో అమ్మవారిని కొలువుదీర్చి మేళతాళాలు నడుమ పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పాతపాళ్యంలో ఓంశక్తి అమ్మవారు దుర్గాదేవి రూపంలో కటాక్షించారు.



బలరామ అవతారంలో ..


రాజరాజేశ్వరిదేవిగా వజ్రాలపురం గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. గ్రామదేవత ముత్యాల మ్మ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ఓటీకే వీధిలోని సత్యమ్మ ఆలయం, రాజావీధిలోని ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మొగిలివెంకటగిరిలో గంగమ్మ ఆలయంలో, మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.





గుడిపాల: కందగిరికొండ వద్ద విజయలక్ష్మిదేవి అలంకరణ, ద్రౌపదీ అమ్మవారికి మహిషాసురమర్దిని అలంకరణ



బంగారుపాళెంలో రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తున్న ముత్యాలమ్మ



దుర్గాదేవిగా భక్తులను కటాక్షిస్తున్న ఓంశక్తి అమ్మవారు



ఐరాల: శాకంబరీ దేవిగా పాలేటమ్మ

పౌరులు సమాజంలో బాధ్యతగా మెలగాలి

బంగారుపాళెం: సమాజంలో పౌరులు బాధ్యతగా మెలగాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లెలో పౌరుల హక్కు ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పౌరులు తమ హక్కులను ఇతరులకు ఇబ్బంది కలగకుండా వినియోగించుకోవాలన్నారు. పౌరులు బాధ్యతగా నడుచుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో అంటరానితనాన్ని విడనాడాలని సూచించారు. అణగారిన వర్గాలపై దాడులు చేసే శక్తులపై ప్రభుత్వం కఠినంగా శిక్షించడం జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు అయినప్పుడే సమాజం అన్ని విధాలా పురోగతి దిశకు సాగుతుందని తెలిపారు.

మేకపిల్లలను ఎందుకు చంపుతున్నట్టు!

పలమనేరు: నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల అదే గ్రామానికి చెందిన పాండు మేకలపాకలోని 16 మేకపిల్లలను గొంతునులిమి వాటిని బండకేసి కొట్టి చంపిన విషయం ఆలస్యంగా వెలుగుచూసిన విషయం తెలిసిందే. అంతకు ముందుకూడా గ్రామానికి చెందిన ఓ రైతు మేకను చంపినట్టు గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో మేకను చంపిన వ్యక్తికి గ్రామపెద్దలు జరిమానా సైతం విధించినట్టు తెలిసింది. ఇలా ఉండగా ప్రాణాలతో ఉన్న మేకపిల్లలను ఆ యువకుడు ఎందుకు కసిగా చంపుతున్నాడనేవిషయం ఆ మండలంలో చర్చనీయాంశమైంది. కాగా మేక మాంసాన్ని వదిలిపెట్టి దాని వృషణాలను మాత్రమే తీసుకెళ్లి తినడం అతనికి అలవాటుగా మారిందని అందుకేఇలా చేస్తున్నాడనే మాట వినిపిస్తోంది. ఏదేమైనా పోలీసుల విచారణలో అసలు విషయం బయటకు రావాల్సి ఉంది.

మెరుగైన వైద్యసేవలు అందించండి



పింఛన్ల పంపిణీ తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సూచించారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. ముందుగా ఆయన కాశిరాళ్ల గ్రామ సచివాలయ పరిధిలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ నిర్దేశించిన సమయం లోపు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం స్థానికంగా ఉన్న వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించి వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వారికి అవసరమైన మందులు ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. చిత్తూరు–గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతుల్లో భాగంగా కాశిరాళ్లలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ–పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ఏఓ దీపకు సూచించారు. స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటివారిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను అక్కడి సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వాటి పరిష్కారానికి అవసరమయ్యే నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాదిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించి, భవనం శిథిలావస్థకు చేరడంతో.. దానిని తొలగించి, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

తపాల కార్యాలయాల పనివేళల సమయం పెంపు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు డివిజన్‌లో తపాల కార్యాలయాల పనివేళల సమయాన్ని పెంచినట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు డివిజన్ పరిధిలోని 9 తపాలా కార్యాలయాల పనివేళలను పెంచుతున్నట్లు చెప్పారు. చిత్తూరు ప్రధాన కేంద్రంలో పనివేళలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, మదనపల్లె ప్రధాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పలమనేరు ఎండీజీ, చిత్తూరు కలెక్టరేట్ ఎస్‌ఓ, పుంగనూరు ఎస్‌ఓలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, కుప్పంలో ఉదయం 8.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.45, మదనపల్లె బజార్ ఎస్‌ఓలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30, బి.కొత్తకోట ఎస్‌ఓలో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3, చౌడేపల్లి ఎస్‌ఓలో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇకపై పనివేళలుగా ఉంటాయని వెల్లడించారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధులను సత్కరిస్తున్న విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ అన్నారు. నగరంలోని రాస్ స్పెషల్ స్కూల్‌లో బుధవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత చట్టాలపై వృద్ధులు అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరించకూడదన్నారు. అనంతరం పలువురు వృద్ధులను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కేశవులు, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

అన్నదానం.. బృహత్తర కార్యక్రమం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: అన్నదానం బృహత్తర కార్యక్రమమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నసూక్తం 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా అభాగ్యులకు 365 రోజులు 25 మందికి ప్రతి రోజూ రూపాయికే అన్నదానం చేయడం మంచి కార్యక్రమం అన్నారు. హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు, జట్టి సినిమా హీరో మురళీకృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 75 వేల మందికి పైగా అనాథలకు రూపాయికే భోజనం అందించినట్లు తెలిపారు. బంగారుపాళెంతో పాటు చీరాల, మహబూబ్‌నగర్, హుబ్లీలో అన్నసూక్తం భోజనశాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మాజీమంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరులో వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన చిత్తూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవరెడ్డి మనవరాలి వివాహ రిసెప్షన్‌కు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన ఆశ్వీరదించారు. పెద్దిరెడ్డి వెంట చిత్తూరు పార్టీ సమన్వయకర్త విజయానందరెడ్డి ఇతర నాయకులు ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డితో భేటీ..



తిరుపతిలో ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన విజయానందరెడ్డి

మరోవైపు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి బుధవారం కలిశారు. తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్రమమద్యం కేసులో అరెస్టు అయిన మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంతో పాటు, కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడతారని విజయానందరెడ్డి ఆకాంక్షించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞానజగదీష్, చిత్తూరుకు చెందిన కార్పొరేటర్ హరిణిరెడ్డి సైతం మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డిమాండ్ల సాధనకు వైద్యుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శిరీష డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. పీహెచ్‌సీలో ఏళ్ల తరబడి పనిచేసినా ఉద్యోగోన్నతులు లేవన్నారు. పొరుగు రాష్ట్రాల్లో టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పిస్తుంటే..మన రాష్ట్రంలో మాత్రం ఈ విధానం అమలు కావడం లేదన్నారు. జీఓ 99 ద్వారా ఇన్ సర్వీస్ పీజీ కోటా కేవలం 15శాతానికి తగ్గించి..ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదన్నారు. దీంతో పాటు పలు రకాల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మునికుమార్, చంద్ర మహేష్, విజయ లక్ష్మీ, హరినాథ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు.. రైతన్నలకు వరం



గుడిపాల: వ్యవసాయ పరికరాలను చూపెడుతున్న అధికారులు

ఐరాల: వ్యవసాయ పరికరాలు, ఇన్‌పుట్‌లపై జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం లాంటిదని, గ్రామీణ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తుందని జిల్లా జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రజిని అన్నారు. బుధవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ మండలస్థాయి కార్యక్రమాన్ని 35 యర్రంపల్లెలో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయో, పురుగు మందులు, సూక్ష్మ పోషకాలపై జీఎస్టీ తగ్గిందని, ఇది సాగుదారులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలలో వ్యవసాయ పరికరాలపై గతంలో 18 శాతం జీఎస్టీని 5 శాతం తగ్గించడం అన్నదాతలకు ఎంతో లాభదాయకమన్నారు. వివిధ రకాల ట్రాక్టర్లు, హార్వెస్టర్, రోటవేటర్‌లు, విడిభాగాలు చౌకగా లభిస్తాయని చెప్పారు. రైతులు, పశు సంరక్షకులు, పాల ఉత్పత్తిదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. రవాణా వాహనాలపై పన్ను తగ్గుడంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చు తగ్గి, రైతులకు మరింత లాభం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, జీఎస్టీఓ ప్రసాద్, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయని, వాటి కొనుగోలు ఇకపై రైతులకు మరింత సులభతరమని ఎంపీడీఓ కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అన్నిశాఖల అధికారులతో పాటు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలకు మేలు జరిగేలా వ్యవసాయ పరికరాలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీని ప్రస్తుతం 5 శాతానికి తగ్గడంతో అన్ని పనిముట్లపై భారీగా రేట్లు తగాయన్నారు.



రైతులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తవణంపల్లెలో..

తవణంపల్లె: వ్యవసాయం పరికరాల కొనుగోళ్లపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిందని వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. బుధవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు జీఎస్టీ 2.0 తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో 120వ సంవత్సర మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ద్రౌపదీదేవి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు అమ్మవారికి, పంచ పాండవులకు పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్య పుష్పాలు, భోజకాలు, మంగళసూత్రం, వివాహ వస్తువులు, పూజా సామగ్రి, ప్రసాదాలను మేళమేళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అర్చకులు సంప్రదాయ ప్రకారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి భక్తితో సారెలు, చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ద్రౌపదీదేవి, పాండవ ఉత్సవ విగ్రహాలను ఊరేగించగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కుకున్నారు.